ఉత్తీర్ణతా శాతం పెంపుపైనే దృష్టి

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు
- హాజరుకానున్న 4,614 మంది విద్యార్థులు



పరీక్షా కేంద్రం వద్ద టెన్త్ విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గత కొన్నేళ్లుగా ఏలూరు నియోజకవర్గం ఆశించిన స్థాయిలో నిలువలేకపోతుంది. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పోల్చితే ఏలూరు స్థానం దిగజారిపోతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది ఈ ఏడాది మంచి ఫలితాలు రాబట్టడానికి మండల విద్యాశాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసే దశకు చేరింది. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

సీ, డీ గ్రేడుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

10వ తరగతిలో సీ, డీ గ్రేడుల్లో నిలిచే విద్యార్థులను విద్యాశాఖాధికారులు గుర్తించారు. వీరికి అన్ని సబ్జెక్టుల్లో అన్ని పాఠాలూ చదవడం సాధ్యం కాదనే ఉద్దేశంతో పరీక్షల్లో ఖచ్చితంగా వస్తాయనే ప్రశ్నలు, వాటి సమాధానాలను ఒకటికి రెండు సార్లు చదివేలా చర్యలు తీసుకున్నారు. ఒక రోజు ఒక సబ్జెక్టులో ముఖ్య ప్రశ్నలను తెలిపి మునటి రోజు వారు దానికి సమాధానం పేపర్‌పై రాయడంతో పాటు ఉపాధ్యాయులకు అప్పజెప్పేలా తర్ఫీదు ఇస్తున్నారు. ఇలా పబ్లిక్ పరీక్షల ప్రారంభం వరకు రోజు విడిచి రోజు ఒక సబ్జెక్టుపై వారికి పట్టు వచ్చేలా చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

10వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల తెరవక ముందే ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, పాఠశాల విడిచిన తరువాత 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలకు ఒక నెల రోజుల ముందు నుంచి రాత్రి 8 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

ర్యాంకులు సాధించేలా..

ఏ, బీ గ్రేడ్ విద్యార్థులను పదో తరగతి పరీక్షల అనంతరం ఐఐఐటీ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఏలూరు నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు వెళ్లేలా, ఇతర పోటీ పరీక్షల్లో సైతం రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు అధికారులు సూచించారు.

పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులు

నియోజకవర్గంలో ఏలూరు నగరం, మండలంలోని 64 ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలల నుంచి ఈ ఏడాది 4614 మంది 10వ తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమౌతున్నారు. వీరిలో 24 ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల నుంచి 1,865 మంది, 40 ప్రైవేట్ యాజమాన్యాల్లోని పాఠశాలల నుంచి 2749 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం ఆరంభంలో పాఠ్యాంశాల బోధన పెద్దగా జరగలేదనే చెప్పాలి. ఉపాధ్యాయులకు శిక్షణ పేరిట కొంత కాలం పాఠ్యాంశాలకు ఈ విద్యార్థులు దూరంగా కాగా, అపార్ నమోదు అంశంలో మరికొంత కాలం అభ్యసనానికి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది విద్యార్థులు అనుకున్న ఫలితాలు సాధించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయులకు సూచనలిచ్చాం



10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఇప్పటికే ఉపాధ్యాయులకు సూచనలిచ్చాం. అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లోని విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సెలవు దినాల్లో సైతం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ప్రత్యేక తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాం. ఈ ఏడాది మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– దేవినేని వెంకట రమణ, ఎంఈఓ–2, ఏలూరు

క్లుప్తంగా

సృజనాత్మకతను వెలికి తీయాలి



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కూడా పాఠశాల వేదిక కావాలని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.సాయికుమారి శంకర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో గ్రేడ్ 1, 2, 3 తరగతుల యాన్యువల్ కన్సర్ట్ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా 2024 వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ ఇండియా చాంపియన్ ఎ.కోమల్ కార్తీక్, అతిథులుగా విద్యా సంస్థల సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్, కమిటీ సభ్యులు బీవీబీవీఎస్ చంద్ర భగవాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శాస్త్రీయ, స్వాగత నృత్యాలతో అలరించారు. లఘు నాటికలతో, వికసిత భారత్ గీతాలాపనతో అబ్బురపరిచారు. సీసీఏ ఆక్టివిటీలు, ఎస్ఓఎఫ్ తదితర పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ వంకినేని రవికుమార్ పర్యవేక్షించారు.

జనార్ధనరావు మృతికి నివాళి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ పారిశ్రామికవేత్త, వెల్లన్ డేనిషన్ ఇండస్ట్రీస్ అధినేత కొవ్వలికి చెందిన చంద్రశేఖర జనార్ధనరావు మృతి పట్ల రెడ్‌క్రాస్ సిబ్బంది సంతాపం ప్రకటించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జనార్ధన్‌రావు రెడ్‌క్రాస్ తలసేమియా భవనాన్ని ఏర్పాటు చేసి చిన్నారులకు రక్తమార్పిడి జరిగేలా చేశారని గుర్తుచేసుకున్నారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, మానవత సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, కడియాల కృష్ణారావు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని వ్యాధులకు చికిత్స ఉంటుందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు నగేష్ అన్నారు. శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నగేష్ వైద్య బృందంచే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 111 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారందరికీ మందులు అందజేశారు. ఈ ఉచిత శిబిరం ప్రతినెలా రెండో శనివారం నిర్వహిస్తున్నట్టు రామారావు తెలిపారు.

రామకోటి మహోత్సవాలు ప్రారంభం



సూర్యకుమారి బృందం కోలాట ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అగ్రహారం పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ రామకోటి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఓంకార ధ్వజారోహణతో ఉత్సవాలను ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఉత్సవ ప్రాంగణంలో వివిధ ధ్వజారోహణలను నగర ప్రముఖులు ప్రత్యేక పూజలతో నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశ్వశాంతి సమాజం సభ్యులు మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన పద్మావతి భజన మండలి ఆధ్వర్యంలో వర్రె సూర్యకుమారి కోలాట బృందం కోలాట ప్రదర్శన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని రాధాకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో రాధ జోస్యుల ధ్యానం – లాభాలు అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కోర్కెలు తీర్చే దేవుడు ఏసుక్రీస్తు



వాక్య పరిచర్య చేస్తున్న పాస్టర్ జ్యోతిరాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏసుక్రీస్తు ఏ అవసరం అడిగినా తీర్చే దేవుడని అంతర్జాతీయ సువార్తికులు పాల్ దినకరన్ అన్నారు. మన్నా చర్చి ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏసు పిలుచుచున్నాడు ప్రార్థన పండుగలు శనివారం పాస్టర్ ఎం జ్యోతిరాజు ఆధ్వర్యంలో కొనసాగాయి. ఈ సందర్భంగా పాల్ దినకరన్ మాట్లాడుతూ ఏసు నామంలో ప్రతి మోకాలు వంగాలని, ఏసుకు ప్రార్థన చేస్తే జవాబు ఇస్తాడని తెలిపారు. ఏసుక్రీస్తు ప్రజల కోసం సిలువలో మరణించి తిరిగి లేచాడని గుర్తుచేశారు. సిస్టర్ ఇవాంజిలిన్ పాల్ దినకరన్, బ్రదర్ శామ్యూల్ దినకరన్, సిస్టర్ స్టెల్లా రమోలా, బ్రదర్ డేనియల్ డేవిడ్సన్, ఫాదర్ బాల, బిషప్ ఎం ఎలీషా రాజు దేవుని సందేశం అందించారు. మన్నా చర్చి వర్షిప్ టీం మధుర సంగీతం, పాటలు, స్తుతి ఆరాధనలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి దేవుని సేవకులు, జిల్లా నలుమూలల నుంచి విశ్వాసులు వేల సంఖ్యలో హాజరయ్యారు.

లక్ష్యాలకు అనుగుణంగా పశుగణన



రైతులకు మందులు అందచేస్తున్న జేడీ గోవిందరాజు

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పశుగణన నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందరాజు అన్నారు. శనివారం కొవ్వలిలో ఆయన పశుగణనను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన చేస్తున్నట్టు చెప్పారు. 2024 డిసెంబర్‌లో ఈ సర్వే ప్రారంభమైందన్నారు. ఆవులు, గేదెలు గొర్రెలు, మేకలు, గుర్రాలు, గాడిదలు, అడవి గేదెలు, కోళ్లు, నాటు కోళ్లు, బాతులు, కుక్కలు తోపాటు 14 రకాల పశువులకు సంబంధించి గణన చేస్తున్నట్టు తెలిపారు. ఇది పరిశోధనతో పాటు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుకు దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కొవ్వలి వైద్యశాలలో మండల పశువైద్య శాఖ అధికారి రామ్మోహనరావు, స్థానిక సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నేతల హర్షం

ఏలూరు (టూటౌన్): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల ఏలూరులో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంబరాల్లో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దౌర్జన్యంపై కేసు

పెదవేగి: దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. విజయవాడ లయోలా గార్డెన్స్‌కు చెందిన జాస్తి వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి పెదవేగి మండలం సూర్యారావుపేటలో 30 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. వీటి పర్యవేక్షణకు ఆగస్టు 2023లో పెదవేగి దిబ్బగూడెంకు చెందిన ఎం వసంతరావు అనే వ్యక్తిని గుమస్తాగా పెట్టుకున్నారని తెలిపారు. ఈ భూముల్లో ఉన్న 3 మోటర్లు, 3 స్టార్టర్లు, కేబుల్ కత్తులు వసంతరావు తీసుకెళ్లి సొంతానికి దుర్వినియోగం చేశాడని, వీటిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేశాడని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

పెదవేగి : భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం తాళ్లగోకవరం గ్రామానికి చెందిన ఎండీ నసీమాతో 2023వ సంవత్సరంలో కొవ్వూరుకు చెందిన ఖాదర్‌వల్లీతో వివాహమైంది. కొంతకాలం గడిచిన తర్వాత ఖాదర్‌వల్లి, అత్త ముంతాజ్ బేగం, మరిది దిల్దార్దు, బోట తోటికోడలు కలిసి అధిక కట్నంకోసం నసీమాను శారీరంగా, మానసింగా హింసిస్తున్నట్టు తెలిపారు. నసీమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న

ఏలూరు (టూటౌన్): విద్యారంగాన్ని బలోపేతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకు దిగజారుతుందని, ఐనా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తుతున్నట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఏలూరు నగరంలో డిగ్రీ కళాశాల సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే చంటి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే డిగ్రీ కాలేజీ పనులు ప్రారంభించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ల్యాబ్స్ లేని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. సెయింట్ థెరిస్సా డిగ్రీ మహిళా కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ రాజా, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, పట్టణ అధ్యక్షులు మనోజ్, పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు వేదికగా సోషల్ మీడియా



2కే రన్ ప్రారంభిస్తున్న త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సోషల్ మీడియా నేరాలకు వేదికగా మారిందని త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్రేయ 2025 ఫెస్ట్ సందర్భంగా సోషల్ మీడియా అనర్థాలపై ఇండోర్ స్టేడియం నుంచి శాంతి నగర్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ప్రాంభించిన కోటేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారంతో పాటు నేరాలకు కూడా ఆస్కారముందని వివరించారు. సోషల్ మీడియా వినియోగం – అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను వినియోగించడంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్, డీన్ శర్మ, డాక్టర్ బవిరిసెట్టి ప్రసాద్, చిరంజీవి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	19
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	07
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	12
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	13
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	13
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32-44	బీట్‌రూట్	32
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	20	అల్లం	50
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

మందకొడిగా వంతెన పనులు

- కూలేందుకు సిద్ధంగా తాత్కాలిక వంతెన
- బిక్కుబిక్కుమంటూ ప్రజల రాకపోకలు



గుండుగొలనులో బెయిలీ వంతెనపై పైకి లేచిన ఇనుప ఊస



శాశ్వత వంతెనకు శ్లాబ్ పనులు చేస్తున్న దృశ్యం

భీమడోలు: జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలిగా ఉన్న గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై 120 ఏళ్ల కితం నిర్మించిన వంతెన ఏడాదిన్నర కితం కూలింది. దీంతో కాల్వపై శాశ్వత వంతెన నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. నేషనల్ హైవే కాంట్రాక్ట్ శాఖ, ఇరిగేషన్‌ల శాఖల మధ్య సమన్వయం కొరవడంతో పనులు మందగొడిగా సాగాయి. అడుగడునా పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతేడాది డిసెంబర్‌లో వంతెన నిర్మాణంలో కీలక ఘట్టంగా ఉన్న మూడు గిడ్డర్లను ప్రజల ఆందోళన నడుమ బిగించారు. జనవరి రెండో వారంలోనే వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని సంబంధిత సివిల్ ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి నెలరోజులు గడుస్తున్నా, ఆ తర్వాత చేపట్టాల్సిన శ్లాబు పనులు నేటికీ పూర్తికాలేదు. ఈనెలాఖరు నాటికి శ్లాబ్ పనులు పూర్తవుతాయని చెబుతున్నారు.

భయంభయంగా రాకపోకలు

జాతీయ రహదారికి అనుసంధానంగా గుండుగొలను గోదావరి కాల్వపై తాత్కాలికంగా నిర్మించిన బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన అడుగు భాగంలోని ఇనుప ఊసలు పైకి లేచి వాహనదారుల పాలిట శాపంగా మారింది. పగలు, రాత్రి అధిక లోడు భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగించడం వల్లే వంతెన ప్రమాద స్థితికి చేరింది. అడుగున భారీ రంధ్రాలు పడడం, ఊసలు ఊడి ఇనుప ప్లేట్లు బలహీనంగా మారి వంతెనపై నడిచినా పెద్దపెద్ద శబ్దాలు వస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వారి పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వంతెనపై 15 గ్రామాల ప్రజలను భయంభయంగా రాకపోకలుసాగిస్తున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనచోదరులు నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. శాశ్వత వంతెన నిర్మాణం కోసం తాత్కాలికంగా నిర్మించిన బెయిలీ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. శాశ్వత వంతెన నిర్మాణ పనులు పూర్తి కాలేదు.

ప్రమాదాలకు నెలవు

శాశ్వత వంతెన నిర్మాణం పూర్తికపోవడంతో గుండుగొలను జంక్షన్‌లో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే 20కి పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా, కొందరు మృతి చెందారు. ఈ వంతెనపై భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి శాశ్వత వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీలకు రాజ్యాధికారం అందించిన జగన్



వెంకట రమణను సత్కరిస్తున్న నాగరాజు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా బీసీలకు రాజ్యాధికారం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నౌడు వెంకటరమణ అన్నారు. పత్తేపురంలో ఆయన నివాసంలో పశ్చిమ గోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్నె నాగరాజుతో నౌడు సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు, జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి వైఎస్సార్ సీపీ బీసీ కార్యకర్తా కృషిచేసేలా జిల్లానుంచి వార్డు స్థాయివరకు ఓ ప్రణా ళిక సిద్ధం చేసుకోనేలా చర్చ జరిగింది. ఈ సందర్భంగా నౌడు రమణ మాట్లాడుతూ జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాల్లో పార్టీ కన్వీనర్లతో చర్చించి అన్ని నియోజకవర్గాల్లో బీసీ కమిటీలు త్వరితగతిన ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. తొలుత మన్నె నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నౌడు రమణను మర్యాదపూర్వకంగా సత్కరించారు.